
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 3
శనివారం 8 నవంబరు 2025



వందేమాతరం..

వందేమాతర గేయం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు పలు పాఠశాలలు, ప్రభుత్వ ఆఫీసుల వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు శుక్రవారం సామూహిక గేయాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, ఇతర అధికారులు, సిద్దిపేటలోని ట్రెస్మా ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో సీపీ విజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు , ఫొటోలు 6లో..



జగదేవ్‌పూర్ బస్టాండ్ వద్ద సామూహికంగా వందేమాతర గేయాలాపన



కలెక్టరేట్‌లో వందేమాతరం గేయం ఆలపిస్తున్న కలెక్టర్ హైమావతి



సిద్దిపేటలో ట్రెస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వందేమాతరం గేయాలాపన చేస్తున్న సీపీ విజయ్‌కుమార్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

5



చిన్నారికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీపీ, తదితరులు

సత్యసాయి సేవలు
మహోన్నతం

● సీపీ విజయ్‌కుమార్

కొండపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ రకాలుగా అందిస్తున్న సత్యసాయి సేవలు మహోన్నతమైనవని సిద్దిపేట సీపీ విజయ్‌కుమార్ కొనియాడారు. కొండపాకలోని ఆనంద నిలయం ఆవరణలో ఉన్న సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ హార్ట్ కేర్‌లో గుండె ఆపరేషన్ అయిన చిన్నారులకు గిఫ్ట్ ఆఫ్ లైఫ్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సీపీ మాట్లాడారు. చిన్న పిల్లలకు పుట్టుకతో గుండెకు సంబంధించిన వ్యాధి వచ్చింది అని తెలిస్తే ఆ తల్లిదండ్రుల బాధ మాటల్లో చెప్పలేనిదన్నారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారికి సంజీవనిగా ఈ ఆస్పత్రి నిలవడం..ఇది ఒక మరో కొత్త ప్రపంచం అని సీపీ పేర్కొన్నారు. దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన పిల్లలందరికీ కుల మత భేదాలు లేకుండా భవిష్యత్తును అందిస్తున్న ఈ కేంద్రంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు అభినందనీయులని అన్నారు. ఆసుపత్రిలో ఆపరేషన్ అయిన పసి హృదయాలను ఆయన పలకరించారు. అనంతరం ఆపరేషన్లు చేసిన నలుగురు చిన్నారులకు మెమెంటోలను అందజేశారు. ఆసుపత్రి చైర్మన్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

నకిలీ విత్తనాలతో
నిండా మునిగిన రైతులు

● చేగుంట మండలం రుక్మాపూర్‌లో వంద ఎకరాల్లో వరికి నష్టం
● సీడ్ కంపెనీ మోసంపై పోలీసులకు రైతుల ఫిర్యాదు

5

కొనమంటే కొర్రీలు

అంచనా కొండంత.. కొన్నది గోరంత

'మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద పది రోజుల నుంచి రైతులు పడిగాపులు పడుతున్నారు. గన్నీ సంచులు లేవని, హమాలీ కార్మికులు రాలేదని చెబుతున్నారు. రైతులు తెచ్చిన ధాన్యం పూర్తిగా ఎండుతున్నా తూకం వేయడం లేదు. అకాల వర్షం కురుస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.'

'సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు ఐకేపీ కేంద్రం ప్రారంభించి 25 రోజులు గడుస్తోంది. తేమశాతం పేరిట తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. వర్షాలకు ధాన్యం తడిసి నల్లగా మారుతోందని, టార్పాలిన్ కవర్లు ఇవ్వడం లేదని చెబుతున్నారు. తాను ధాన్యం తెచ్చి 26రోజులైనా కొనుగోలు చేయలేదని నక్క రాజేందర్ అనే రైతు ఆవేదన చెందాడు.'

'సంగారెడ్డి జిల్లా జోగిపేట మార్కెట్ యార్డు, అందోల్ మండలం అన్నాసాగర్ కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యం ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి ముద్దయ్యింది. వెనువెంటనే కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం తడిసింది. తేమశాతం తగ్గేదాకా మళ్లీ కొనుగోలు చేయబోమని చెబుతున్నారు.'

కేంద్రాల్లో సమస్యల తిష్ఠ

వర్షాలకు తడిసిన వడ్లు
తేమశాతం పేరిట ఇబ్బందులు
ధాన్యం కుప్పల వద్దే రైతుల పడిగాపులు

ఆరుగాలం శ్రమించి వడ్లు పండించిన అన్నదాతకు అమ్ముకుందామంటే ఆపసోపాలు తప్పడంలేదు. అకాల వర్షాలకు తోడు కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలతో బావురుమంటున్నాడు. సెంటర్ల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు పడుతున్నాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇదే పరిస్థితి ఉన్నది.



సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం అన్నాసాగర్ కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం



నంగునూరు మండలం సిద్దన్నపేటలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళ

సంగారెడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు మూడు వారాల క్రితమే ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తెస్తున్నారు. తేమ శాతం పేరిట నిర్వాహకులు కొర్రీలు పెట్టడంతో వడ్లను ఆరబెట్టగా.. ఇటీవల కురిసిన అకాల వర్షాలు ఆగం చేశాయి. కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు ధాన్యాన్ని ఆరబోయడం.. సాయంత్రానికి వర్షం కురిసి తడిసిపోవడం షరామామూలుగా మారింది. దీంతో, రోజుల కొద్దీ రైతులు కేంద్రాల్లోనే మగ్గుతున్నారు. ధాన్యం ఎండినా హమాలీలు లేరని, గన్నీ సంచులు రాలేదని మిగతా 5వ పేజీలో

ఉమ్మడి మెదక్ జిల్లాలో ధాన్యం సేకరణ వివరాలు

జిల్లా	వరిసాగు	ధాన్యం అంచనా	కేంద్రాలు	కొనుగోలు
సంగారెడ్డి	1.40లక్షల ఎకరాలు	3.30లక్షల టన్నులు	207	625 టన్నులు
సిద్దిపేట	3.55లక్షల ఎకరాలు	5లక్షల టన్నులు	420	32,729టన్నులు
మెదక్	2.97లక్షల ఎకరాలు	3.23లక్షల టన్నులు	518	11,144టన్నులు

వర్షానికి మొలకలు వస్తున్నాయి



దుద్దెడ కొనుగోలు కేంద్రంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. వర్షానికి అంతా బురద తయారైంది. ధాన్యం ఆరబెట్టడానికి స్థలమే లేదు. వర్షానికి గింజలు మొలకెత్తుతున్నాయి. నెలరోజుల నుంచి ఇక్కడ ఇబ్బంది పడుతున్నాం.

- శ్రీనివాస్, రైతు, దుద్దెడ, కొండపాక మండలం

కేంద్రాల్లో స్థలమే లేదు



అకాల వర్షాలతో పొలాల్లో పైర్లు కోయడం ఇబ్బందిగా మారింది. కోసిన ధాన్యాన్ని ఆరబెడదామంటే స్థలం లేక రెండ్రోజుల నుంచి మార్కెట్‌లో కుప్పలు పోశాం. సరైన స్థలాలు లేక అవస్థలు పడుతున్నాం. సౌకర్యాలు కూడా సరిగ్గా లేవు.

-లావణ్య, మహిళా రైతు, రామాయంపేట

చెరువుల్లోకి చేరనున్న చేపపిల్లలు

● ఎట్టకేలకు పూర్తయిన టెండర్ ప్రక్రియ
● రెండురోజుల్లో 1715 రిజర్వాయర్‌లు, చెరువుల్లో 4.42 కోట్ల చేప పిల్లల పంపిణీకి ఏర్పాట్లు

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురవడంతో జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీకి సిద్ధమైంది. ఈ ఏడాది జిల్లాలోని చెరువుల్లో 4.42 కోట్ల చేప పిల్లలను వదలాలని అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. టెండర్ ప్రక్రియ ఎట్టకేలకు పూర్తి కావడంతో, రెండు రోజుల్లో చెరువుల్లోకి చేప పిల్లలు వేయడానికి జిల్లా మత్స్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

378 మత్స్య సహకార సంఘాలు...

జిల్లాలో రిజర్వాయర్లు, చెరువులు కలిపి 1715 ఉన్నాయి. 378 మత్స్య సహకార సంఘాలు (40 మహిళా సంఘాలతో కలిపి) ఉండగా, వాటిలో 24,698 మంది మత్స్యకారులు చెరువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గాను గత ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీని ప్రారంభించింది. ఈ ఏడాది డీపీసీ (జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీ) పర్యవేక్షణలో టెండర్ ప్రక్రియ



మిగతా 6వ పేజీలో

దుబ్బాక డయాలసిస్ సెంటర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

● ఉత్తమ సేవా విభాగంలో రెండోసారి ప్రథమ స్థానం

దుబ్బాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం మరోసారి రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవా విభాగంలో ప్రథమ స్థానాన్ని సాధించి అవార్డును దక్కించుకుంది. ఇప్పటికే గత ఏప్రిల్‌లో మొదటి స్థానం పొందిన ఈ కేంద్రం, తిరిగి రెండవసారి కూడా ఈ అరుదైన గుర్తింపును పొందడం విశేషం. మార్చి 5, 2023లో ఐదు డయాలసిస్ బెడ్స్‌తో ఈ కేంద్రం ప్రారంభం అయ్యింది. ఇప్పటి వరకు సుమారు 10వేల మందికి డయాలసిస్ సేవలు అందించారు. అపెక్స్ కిడ్నీ కేర్ ప్రైవేట్ లిమిటెడ్, ముంబై ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ డయాలసిస్ సేవలను గుర్తించి రాష్ట్రంలోని అన్ని డయాలసిస్ కేంద్రాల్లోకెల్లా దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డు-2004లో భాగంగా ప్రథమ స్థానం దక్కింది. తాజాగా, 2025లో కూడా రెండవసారి ఈ అవార్డును సాధించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండ్ డాక్టర్ హేమరాజ్‌సిం గ్ డయాలసిస్ ఇన్‌చార్జి శేఖర్, సిబ్బంది సురేష్, స్వామి, మానస, వివేక్, రమేష్‌లను సన్మానించి, వారి ఉత్తమ సేవలను అభినందించారు.



సిబ్బందిని అభినందిస్తున్న సూపరింటెండెంట్ హేమరాజ్

అమ్మో.. కూరగాయలు

● అకాల వర్షానికి పడిపోయిన దిగుబడి, మండుతున్న ధరలు
● ఆకాశాన్నంటుతున్న ఆకుకూరల ధరలు

తొగుట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సామాన్యుడి వంట ఇంటి బడ్జెట్‌ను ఇటీవల కురిసిన అకాల వర్షాలు తలకిందులు చేశాయి. కూరగాయలు, ఆకుకూరల ధరలు రోజురోజుకూ మండిపోతున్నాయి. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో, కూరగాయల దిగుబడి భారీగా తగ్గిపోయింది. దాంతో మార్కెట్లో కూరగాయల ధరలు ఒక్కసారిగా రెట్టింపు అయ్యాయి. ప్రధానంగా ఆకుకూరల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా కొత్తిమీర పది రూపాయలకు రెండు చిన్నపాటి కట్టలకే పరిమితమైంది. గోంగూర, పాలకూర, తోటకూర ధరలు కూడా సాధారణం కంటే చాలా పెరిగాయి. అలాగే, నిత్యావసర కూరగాయలైన పచ్చిమిర్చి, చిక్కుడు కాయ, బెండకాయ, బీరకాయ, వంకాయ, బీన్స్ ధరలు అమాంతం పెరిగాయి. మార్కెట్‌కు వెళ్లిన సామాన్య ప్రజలు ధరలు చూసి కూరగాయలు కొనాలంటేనే జంకుతున్నారు. సగానికి సగం కొనుగోలు తగ్గించుకుంటున్నారు. కిలోల లెక్కన కొనేవారు కూడా పావు కిలోకు పరిమితమవుతున్నారు. ఈ ధరల పెరుగుదల సామాన్యుల జేబులకు చిల్లు పెడుతోంది.

కూరగాయలు	ధరలు (కిలో)
గోరుచిక్కుడు	రూ. 70
బెండకాయ	రూ. 54
నల్లవంకాయ	రూ. 44
పచ్చిమిర్చి	రూ. 54
క్యారెట్	రూ. 64
చిక్కుడు	రూ. 64
బీరకాయ	రూ. 54
టమాటా	రూ. 24
కాకర	రూ. 44
బీన్స్	రూ. 74
దొండకాయ	రూ. 50

విధుల్లో చేరిన ఉపాధ్యాయుడు

● మరోసారి ఉత్తర్వులు జారీ

మర్కుక్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా బదిలీ చేసినా నవంబరు ఒకటో తేదీ నుంచి పాఠశాలకు వెళ్లకుండా, ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా లెక్కచేయకుండా అటు పాత పాఠశాలకు, ఇటు డిప్యుటేషన్ పాఠశాలకు హాజరు కాని బయాలజీ ఉపాధ్యాయుడు కిష్టయ్య ఎట్టకేలకు విధుల్లో చేరారు. "బదిలీ చేసిన వెళ్లట్లే" శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించిన కథనాన్ని ఉన్నతాధికారులు మరోసారి సీరియస్‌గా తీసుకున్నారు. మరోసారి ఆదేశాలు జారీ చేయడంతో, ఆయన శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చేబర్తిలో విధుల్లో చేరినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డి తెలిపారు. బయాలజీ ఉపాధ్యాయుడు విధుల్లో చేరడంతో పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు తప్పనున్నాయి. ముఖ్యంగా, పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల సమయంలో సైన్స్ సబ్జెక్టుకు సంబంధించిన బోధన ఎంతో ఉపకరిస్తుందని గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆంధ్రజ్యోతి పత్రికకు అభినందనలు తెలిపారు.

ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదు

● అధికారులతో కలెక్టర్ హైమావతి
● ఓటరు జాబితా తయారీపై రాజకీయ పార్టీలతో సమీక్ష
● అభివృద్ధి పనుల వేగవంతంపై పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలు
● భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై జూమ్ మీటింగ్



కలెక్టర్ సమీక్షలో పాల్గొన్న అధికారులు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన దరఖాస్తులు, అభివృద్ధి పనులు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఒక్క దరఖాస్తు కూడా ఉండకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఓటరు జాబితాపై...

కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా పారదర్శకంగా ఉండేందుకు ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. నియోజకవర్గం వారీగా ఒక్కో రాజకీయ పార్టీ నుంచి బూత్ లెవల్ ఏజంట్లను నియమించాలని పార్టీ ప్రతినిధులకు ఆమె సూచించారు.

ఇంజనీరింగ్ పనుల వేగవంతంపై సమీక్ష

జిల్లా పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ చేపడుతున్న కార్యకలాపాలపై పంచాయతీరాజ్ ఇంజనీర్ శాఖ ఈఈ, డీఈ, ఏఈలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద చేపడుతున్న అంగన్‌వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, వైకుంఠధామాలు, సీసీ రోడ్లు, పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, మహిళా సమాఖ్య భవనాలు, మినీ ఫంక్షన్ హాళ్లు, డ్రైనేజీ తదితర నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.భవనాలకు స్థలం కొరత ఉన్న మండలాల్లో తహసీల్దార్లను సంప్రదించి స్థలాన్వేషణ చేయాలని సూచించారు. పనులు పూర్తయిన వెంటనే ఎఫ్‌టీఓ (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) జనరేట్ చేయాలని స్పష్టం చేశారు.

భూభారతి పెండింగ్ దరఖాస్తులపై

భూభారతి పెండింగ్ అప్లికేషన్స్ డిస్పోజల్ ప్రక్రియ గురించి అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన సాదాబైనామా దరఖాస్తులతో పాటు ఇతర అప్లికేషన్స్‌ను మండలాల వారీగా సమీక్షించారు. తహసీల్దార్లు, ఆర్డీవో స్థాయిలలో పెండింగ్ లేకుండా పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని ఆదేశించారు. భూ భారతి చట్టం మార్గదర్శకాల ప్రకారం ఫీల్డ్ వెరిఫై చేసి అత్యంత పారదర్శకంగా డిస్పోజల్ ప్రక్రియ చేయాలని చెప్పారు.

రెడీమిక్స్ వాహనం బోల్తా

పటాన్‌చెరు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హైవేపై రెడీమిక్స్ వాహనం బోల్తాపడి భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి గ్రామం నుంచి కాంక్రీట్ లోడ్‌తో వెళ్తూ పటాన్‌చెరు పాత టోల్‌గేటు నుంచి దాటుతుండగా అదుపుతప్పింది. లోడ్ ఎక్కువవడంతో ఒక్కసారిగా పక్కకు ఒరుగుతూ పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎక్స్‌కవేటర్ సహాయంతో వాహనాన్ని మామూలు స్థితికి తెచ్చారు. డ్రైవర్, క్లీనర్‌లు గాయాలయ్యాయి.





సంగారెడ్డిలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆలపిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వెంకటేశ్వర్లు, మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సామూహిక వందేమాతరం పాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు, సిద్దిపేట కలెక్టరేట్‌లో ఆలపిస్తున్న ఉద్యోగులు



సామూహిక ఆలాపనలో మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు, అధికారులు

గొంతులన్నీ ఒక్కటై..
వందేమాతరం ఆలపించి

బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా శుక్రవారం ఉమ్మడి జిల్లాలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ కూడళ్లలో సామూహిక ఆలాపన కార్యక్రమాలను నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతా ఏకస్వరంతో గేయాన్ని ఆలపించి స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని ప్రతిధ్వనింపజేశారు. దేశభక్తిని చాటి, జాతయ సమైక్యతను చాటిచెప్పారు.

-మెదక్ అర్బన్/సిద్ది పేట కల్చరల్/సంగారెడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి)



సిద్దిపేటలో ట్రెస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు

జాతీయ సాహస శిబిరానికి మెదక్ డిగ్రీ విద్యార్థి ఎంపిక



అన్నపూర్ణ

మెదక్ అర్బన్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సాహస శిబిరానికి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి అన్నపూర్ణ ఎంపికైంది. ఈనెల 9 నుంచి 19 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో జరుగనున్న సాహస శిక్షణకు డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థి అన్నపూర్ణ పాల్గొననున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సింహారెడ్డి తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో ఘనపూర్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తొగుట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వారధి ఇండియా ఫౌండేషన్ గత నెల నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో తొగుట మండలం ఘనపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. పాఠశాలకు చెందిన జి.నిహారిక(9వ తరగతి), పి.ప్రణయ్‌రిత్విక్, జి.భవ్యశ్రీ(10 వతరగతి) విద్యార్థులకు రూ.27 వేల నగదు బహుమానం అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, సహకరించిన గైడ్ టీచర్ నవీన్ కుమార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, జిల్లా విద్యాధికారి, ఎంఈవో అభినందించారు.

స్కౌట్స్‌గైడ్స్ జాతీయస్థాయి పోటీలకు నిజాంపేట కేజీబీవీపీ విద్యార్థుల ఎంపిక

రామాయంపేట, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన నిజాంపేట కేజీబీవీకి చెందిన 32 మంది విద్యార్థినులు జాతీయస్థాయి స్కౌట్స్ గైడ్స్ పోటీలకు అర్హత సాధించారని పీఈటీ జ్యోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి డిసెంబర్ 3 వరకు ఉత్తర ప్రదేశ్ లక్నోలో జరిగే నేషనల్ లెవెల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

తూప్రాన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఆవులు, లేగదూడలు రవాణా చేస్తుండగా వాహన తనిఖీలో పట్టుకున్నారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్తే.. తూప్రాన్ పట్టణ పరిధి నర్సాపూర్ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. వాహనంలో అక్రమంగా మూడు ఆవులు, రెండు లేగ దూడలు, ఒక దుడ్డె పట్టుబడ్డాయి. వాహనంలో ఇబ్బంది కరంగా కుక్కి రావాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు వాహన డ్రైవర్ నర్సింహ్మారెడ్డి, ఎండీ ఇర్ఫాన్, వాహన యజమాని వినోద, పశువుల యజమాని మహ్మద్ షఫిలపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కొనమంటే కొర్రీలు

(3వ పేజీ తరువాయి)

తూకం ఆలస్యం చేస్తున్నారు. ఈ సమస్యలన్నింటితో ధాన్యం సేకరణ ఊపందుకోలేదు.

అకాల వర్షాలతో ఆగమాగం

అకాల వర్షాలతో కోతకు వచ్చిన వరి పంట దెబ్బతిన్నది. కోతలు పూర్తిచేసి కేంద్రాలకు తెచ్చిన ధాన్యం రాశులు తడిసి ముద్దవుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 40 శాతం కోతలు పూర్తికావడంతో ధాన్యాన్ని కేంద్రాలకు తరలించారు. కానీ, సెంటర్ల వద్ద సరిపడా స్థలం లేకపోవడంతో రహదారులపై ఆరబెడుతున్నారు. ధాన్యం సేకరణ పూర్తి కావడానికి మరో నెలరోజులు పట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అప్పటికీ పూర్తికాకుంటే వర్షాల ముప్పు తప్పదు. ధాన్యాన్ని కొనుగోలులో వేగం పెంచకపోతే రైతులు నష్టపోక తప్పదని ఆందోళన వ్యక్తమవుతున్నది.

కేంద్రాల కన్నా మిల్లులు మిన్న

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ఇస్తున్నది. ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389, బీ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,369 ధర ప్రకటించింది. ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెబుతున్నారు. కానీ, ధాన్యాన్ని కొనుగోలు చేయడమే అసలు సమస్యగా మారింది. తేమ, తాలు పేరిట కోతలు, కేంద్రాల్లో వసతులు లేకపోవడం.. ఇలా రకరకాల సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి. ఈ ఇబ్బందుల కంటే నేరుగా పొలం నుంచి రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించి విక్రయించడమే సులువైన మార్గంగా రైతులు భావిస్తున్నారు. నేరుగా ధాన్యం తీసుకువస్తే మిల్లర్లు క్వింటాలుకు రూ.1,800 నుంచి రూ.1,900 వరకు చెల్లిస్తున్నారు. క్వింటాలుకు రూ.500 నుంచి రూ.550 నష్టంపోతున్నా కేంద్రాల్లో అగచాట్లను పడలేక రైతులు మిల్లుల వైపే మొగ్గు చూపుతున్నారు.

నకిలీ విత్తనాలతో నిండా మునిగిన రైతులు

- చేగుంట మండలం రుక్మాపూర్‌లో వంద ఎకరాల్లో వరికి నష్టం
- సీడ్ కంపెనీ మోసంపై పోలీసులకు రైతుల ఫిర్యాదు



నష్టపోయిన రుక్మాపూర్ రైతులు

చేగుంట, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): విత్తన ఏజెన్సీలు అంటగట్టిన ప్రయోగాత్మక విత్తన రకంతో మెదక్ జిల్లా చేగుంట మండలంలో రైతులు నిండా మునిగారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడి వస్తుందని ఆశించిన అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. బాధిత రైతులు, శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్, వ్యవసాయ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. చేగుంట మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో దాదాపు నలభై మంది రైతులు కలిసి వందకుపైగా ఎకరాల్లో 45,47 (మగరకం) వరి పంటను పండించారు. ఇది ప్రయోగాత్మక, దొడ్డు రకం విత్తనమని కంపెనీ వారు



ఇప్పుడిప్పుడే పిలకలు వస్తున్న వరి పైరు

చెప్పడంతో రైతులు నమ్మి సాగు చేశారు. అయితే, పంట కోత దశకు చేరుకునే సరికి వారి ఆశలు అడియాశలయ్యాయి. పంటకు గట్టిగా ఒక్కటి లేదా రెండు మాత్రమే పిలకలు వచ్చాయి. వరి గింజలు పాలు పోసుకొని గట్టిపడాల్సింది పోయి, మెత్తగానే ఉండిపోయాయి. మరికొన్ని పొలాల్లో పైర్లు మాడిపోయాయి. దిగుబడి మాట దేవుడెరుగు, కనీసం పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతులు ఇప్పటికే ఒక్కో ఎకరానికి సుమారు 20 వేల వరకు ఖర్చు చేశారు. ఈ నకిలీ విత్తనాల కారణంగా రుక్మాపూర్ ఒక్క గ్రామంలోనే రైతాంగానికి సుమారు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. రైతులకు ఈ నకిలీ విత్తనాన్ని నమ్మబలికి, అంటగట్టిన సదరు సీడ్ కంపెనీ సూపర్‌వైజర్ ప్రస్తుతం పత్తా లేకుండా పోయాడు. దీంతో చేసేది లేక, మోసపోయిన రైతులు న్యాయం కోసం అధికారులను, పోలీసులను ఆశ్రయించారు. 'కొత్త రకం సీడ్ అధిక దిగుబడి వస్తుందని, ప్రభుత్వం కంటే క్వింటాకు రూ.200 ధర ఎక్కువ వస్తుందని కంపెనీ సూపర్‌వైజర్ మాటలు నమ్మి సాగు చేస్తే, అందరూ కోతలు కోసి ధాన్యం అమ్ముకుంటే మేము వేసిన నాటుకు ఇప్పుడిప్పుడే పిలకలు వస్తున్నాయి. కంపెనీ సూపర్‌వైజర్ సూచన మేరకు మందు పిచికారి చేస్తే మాడిపోయింది.' అని రుక్మాపూర్‌కు చెందిన రైతులు మ్యాకల శ్రీనివాస్, లక్ష్మి, మాచిన్‌పల్లి గణేష్ వాపోయారు. విత్తన కంపెనీపై కఠిన చర్యలు తీసుకొని, తమకు నష్టపరిహారం ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

పత్తి చేను పరిశీలించిన ఏఈవో

- నకిలీ విత్తనాలతో పూత రాలేదని ధ్రువీకరణ.. ఏవోకు ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మద్దూరులో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతు బెల్లి వెంకటయ్య పత్తి పంటను ఉన్నతాధికారుల సూచనల మేరకు ఏఈవో రాజు పరిశీలించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'నకిలీ పత్తి విత్తనాలతో నట్టేట మునిగిన రైతు' కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఏఈవో రాజు రైతుతో కలిసి పత్తి చేనులో తిరిగి మొక్కల్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈవో రాజు మాట్లాడుతూ మద్దూరులోని శ్రీరామ ఫర్టిలైజర్ నిర్వాహకులు సంపత్, రైతు బెల్లి వెంకటయ్య ద్వారా వివరాలు సేకరించినట్లు తెలిపారు. జూన్‌లో సర్కార్, డాక్టర్ చంద్రగోల్డ్, రణధీర్, జీహెచ్‌హెచ్ 020, బిజిక్స్ కంపెనీలకు చెందిన 16 పత్తి ప్యాకెట్లు, 2 కంది ప్యాకెట్లతో పాటు మందులకు అన్నీ కలిపి సుమారు రూ.80వేలకు



పంటను పరిశీలిస్తున్న ఏఈవో

పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. పత్తిమొక్కలు ఏపుగా పెరిగాయే తప్ప పూత, ఖాత లేదని ధ్రువీకరించామన్నారు. ఈ విషయమై ఏవో రామకృష్ణకు సమాచారం అందించినట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్న వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. పత్తి ఏరివేతకు కోహెడ మండలం తీగలకుంటపల్లికి కూలీలతో వెళ్ల వస్తున్న ఆటో బోల్తాపడడంతో వృద్ధురాలు మృతిచెందింది. ములుగులో ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొనడంతో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. పోచారం ఔటర్‌రింగ్‌రోడ్డు సర్వీస్ రోడ్డుపై బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు.

- ములుగులో లారీ డ్రైవర్ దుర్మరణం
- పోచారం ఔటర్‌సర్వీస్ రోడ్డుపై ప్రమాదంలో యువకుడు
- తీగులకుంటపల్లిలో ఆటో బోల్తాపడి వృద్ధురాలు మృతి
- మరో ఐదుగురికి గాయాలు



హరిసింగ్ (ఫైల్)

ములుగు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనగా లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లాలోని మండల కేంద్రమైన ములుగులో చోటుచేసుకున్నది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ బోయిన్‌పల్లికి చెందిన హరిసింగ్(44) లారీ నడుపుతుంటాడు. ఈ నెల 5న చత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్ నుంచి హైదరాబాద్‌కు ఐరన్ పైపు లోడుతో బయలుదేరాడు. గురువారం అర్ధరాత్రి తరువాత రాజీవ్‌రహదారిపై ములుగు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొని హరిసింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. హరిసింగ్ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

బైక్‌ను టిప్పర్ ఢీకొని యువకుడు

పటాన్‌చెరు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని ఔటర్‌రింగ్‌రోడ్డు సర్వీస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయాలపాలైన యువకుడు మృతిచెంది. సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్నాపూర్ పురపాలక పరిధి చిట్కుల్ గ్రామంలో నివాసం ఉంటున్న భానూరి సురేష్(30) తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి ఇంద్రేశం గ్రామానికి స్కూటీపై బయలుదేరాడు. మార్గంమధ్యలో పోచారం గ్రామం ఔటర్ సర్వీస్ రోడ్డుపై వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను 108 పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. వైద్యుల సూచనతో గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో సురేష్ మృతిచెందాడు. తల్లి కంసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



కట్ల లచ్చవ్వ (ఫైల్)

కుక్కలను అడ్డుతప్పించిపోయి ఆటో బోల్తా

కోహెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కూలీలతో వెళ్తున్న బోల్తా పడడంతో వృద్ధురాలు మృతిచెందగా, మరో ఐదుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధి తీగులకుంటపల్లి గ్రామ క్రాసింగ్ వద్ద చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన జేరిపోతుల వెంకటేష్‌కు చెందిన ఆటోలో ఆరుగురు కూలీలు కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామానికి పత్తి ఏరేందుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా తీగకుంటపల్లి గ్రామ క్రాసింగ్‌వద్ద ఆటోకు కుక్కలు అడ్డురావడంతో వాటిని తప్పించబోతుండగా ఆటో బోల్తాపడింది. ఈ సంఘటనలో కట్ల లచ్చవ్వ (65) అక్కడికక్కడే మృతిచెందింది. మరో ఐదుగురు కూలీలతో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కరీంగనర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయాలైన కూలీలను 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు యువకుల ఆత్మహత్య

ములుగు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒకరు అనారోగ్యంతో, మరొకరు అప్పులబాధతో, ఇంకొకరు ఉరేసుకుని బలవన్మరణం చెందారు.

పక్షవాతం రావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి యువకుడు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా ములుగు మదిర గ్రామమైన మాసాన్‌పల్లిలో చోటుచేసుకున్నది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుంకరి స్వామి(29) కొంతకాలంగా పక్షవాతం రావడంతో ఇంటికి పరిమితుయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గత నెల 12వ తేదీన ఆర్టికల్చర్ యూనివర్సిటీ సమీపంలో పురుగుల మందు తాగాడు. నిమ్స్‌లో చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతిచెందాడు.



స్వామి(ఫైల్)

గుండ్లమాచునూర్‌లో ఉరేసుకుని ఒకరు

హత్నూర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా గుండ్లమాచునూర్‌లో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన తమ్మాలి భాస్కర్(38) గ్రామ శివారులోని ఎపిటోరియ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య మంజుల, కుమారుడు, కూతురు ఉన్నారు. గురువారం సాయంత్రం అతడి తమ్ముడి ఇంట్లో చిన్న ఫంక్షన్ ఉండడంతో కుటుంబీకులు, బంధుమిత్రులతో కలిసి భోజనం చేసి, అనంతరం అతడు నివాసముంటున్న ఇంటిలోకి వెళ్లి పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో వెళ్లి చూసేసరికి ఇంటిలోని చీరతో ఉరేసుకొని కనిపించాడు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీధర్‌రెడ్డి కేసు నమోదు చేసుకున్నారు.

అప్పుల బాధతో మరొకరు

పటాన్‌చెరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రేశం పురపాలక పరిధి ఐనోలు గ్రామానికి చెందిన ప్రభాకర్(35) కూలి పని చేస్తుంటాడు. గ్రామంలో సొంతంగా ఇల్లు నిర్మించుకున్నాడు. రెండు లక్షలు అప్పు చేశాడు. అప్పు తీర్చే పరిస్థితి కనిపించక మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విశాలాక్షి సమేత విశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపనోత్సవాల్లో స్వామీజీలు

నారాయణఖేడ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్‌లో విశాలాక్షి సమేత విశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్, బీచ్కుంద పీఠాధిపతి సోమాలింగశివాచార్య, మల్లన్న గుట్ట పీఠాధిపతి బసవలింగఅవదూతగిరి మహారాజ్, పంచగామ పీఠాధిపతి కాశీనాథ్‌బాబా, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.



మహా పూర్ణాహుతిలో పుష్పగిరి పీఠాధిపతి

అష్టాదశ శక్తిపీఠ ఆలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

కొండపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొండపాక ఆనంద నిలయం ఆవరణలోని అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర ఆలయం ఆవరణలో కాలభైరవ వీరభద్ర చండీశ్వర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జగద్గురు పుష్పగిరి శంకరాచార్య విద్యాశంకర భారతీ స్వామి, రంగంపేట పీఠాధిపతి మాధవానందసరస్వతి శాస్త్రోక్తంగా క్రతువును నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా వారు భక్తులనుదేశించి అనుగ్రహ భాషణం చేశారు

కనులపండువగా రుక్మిణీపాండురంగ కల్యాణోత్సవం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం గజేంద్ర ఆశ్రమంలో శుక్రవారం రుక్మిణీపాండురంగస్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్ భారతి మహారాజ్ ఆధ్వర్యంలో క్రతువు కొనసాగింది. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కభక్తులకు నిర్వహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అవధూత మహారాజ్, జ్ఞానేశ్వర్ మహారాజ్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నీటి నిల్వలు లేకుండా చూడాలి

మద్దూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలని పంచాయతీ సెక్రటరీ అనిత తెలిపారు. శుక్రవారం డ్రైడేను పురస్కరించుకుని గ్రామంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ నీటి నిల్వలను గుర్తించి పారబోయించారు. పరిసరాలతో పాటే ఇంటి ఆవరణలో ఎలాంటి నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు.

వైద్యానికి ఆర్థికసాయం

చేర్యాల/కొమురవెల్లి: నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం పెద్దరాజుపేట గ్రామానికి చెందిన తెట్టెబావి యాకూబ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిన నాగపురి కిరణ్‌కుమార్ స్పందించి, ఈ విషయాన్ని మంత్రి పొన్నంప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద రూ.1.90లక్షలమేర ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం ఎల్‌వోసీ ప్రతిని అతడికి అందజేశారు. అదేవిధంగా కొమురవెల్లి మండలంలోని గౌరాయపల్లి గ్రామానికి చెందిన పెద్ది సంతోష్‌రెడ్డికి ప్రమాదవశాత్తు కాలు విరిగి వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చయ్యింది. అతడికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.60వేల ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం రూ.60వేల విలువైన చెక్కును నాగపురి కిరణ్‌కుమార్, స్థానిక నాయకులతో కలిసి వారి స్వగృహంలో అందజేశారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మిరుదొడ్డి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని మిరుదొడ్డి ఎంపీడీవో గణేషరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండలం కాసులాబాద్, లింగుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇందిరమ్మ నిర్మాణ పనులను పరిశీలించారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

సిద్దిపేట అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలి పాడి గేదె మృతి చెందిన సంఘటన సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం తమ పంట పొలం పరిసర ప్రాంతాలలో పశువులను మేపడానికి తీసుకువెళ్లగా పొదలో తెగి పడిన విద్యుత్ వైర్లకు తగిలి గేదె మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన గేదె విలువ సుమారు 85 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

సిద్దిపేట అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించి అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకునే విధంగా ముందుకు సాగాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గురుకుల పాఠశాల, కళాశాలలో జరుగుతున్న జూన్ 11వ స్పోర్ట్స్‌మీట్‌లో శుక్రవారం ఆయన పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్ ప్రత్యూష, డీసీవో నరసింహాచారి, ప్రిన్సిపాల్ లక్ష్మాంజలి, మీడియా ఇన్‌చార్జి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు విశ్వతేజ

గజ్వేల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ వాలీబాల్ పోటీలకు గజ్వేల్ పట్టణంలోని విశ్వతేజ జూనియర్ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె. రాజు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న బానోతు ఇందు జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెలాఖరున మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో సైతం విజయం సాధించాలని వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు ఆకాంక్షించారు.

రహదారి గుంతలను పూడ్చిన బీఆర్ఎస్ నేత

దుబ్బాక, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్ల నుంచి గుంతల మయంగా మారిన రహదారిని మరమ్మతు చేయడానికి దుబ్బాక బీఆర్ఎస్ పార్టీ మహిళావిభాగం నాయకురాలు నడుం బిగించింది. ప్రమాదాలకు కారణమవుతున్న రహదారిని ప్రభుత్వం పట్టించుకోవడంలేదంటూ, శుక్రవారం తనసొంత ఖర్చులతో బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాలు కత్తికార్తీకగౌడ్ గుంతలు పూడ్చివేయించింది. ప్రభుత్వం రహదారులకు నిధులు ఇవ్వడంలేదంటూ.తానే స్వచ్చందగా గుంతలు పూడ్చివేస్తాననీ ముందుకు వచ్చారు. దుబ్బాక చేర్వాపూర్ మున్సిపల్‌లోని రహదారిని వెంటనే గుంతలు పూడ్చివేశారు.

దళిత సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా గడ్డం వెంకటేష్

గజ్వేల్ రూరల్ నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా గడ్డం వెంకటేష్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రం, రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి సంయుక్తంగా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన గడ్డం వెంకటేష్ గ్రామాల్లో, మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తూ, దళిత సంఘాల ఐక్యతను పటిష్టం చేయాలని, తద్వారా సంఘాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని రాష్ట్ర నాయకత్వం సూచించింది.



గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో వందేమాతరం ఆలాపనలో ఏసీపీ నర్సింలు తదితరులు



మద్దూరులో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న అధికారులు

మార్మోగిన వందేమాతరం



సిద్దిపేటలోని మెరిడియన్ పాఠశాలలో వందేమాతరం ఆకృతిలో విద్యార్థులు

బంకించంద్ర చటర్జీ రచించిన దేశభక్తి గేయం వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో, పలు సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ముక్తకంఠంతో ఆలపించిన వందేమాతరం గేయం దేశభక్తిని చాటిచెప్పింది. అనంతరం జాతీయోద్యమ మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వందేమాతరం ఉద్యమం గురించి ఉపాధ్యాయులు, అధ్యాపకులు అవగాహన కల్పించారు. పలు విద్యాసంస్థల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి)



ములుగు ప్రభుత్వ కళాశాలలో..



హుస్నాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వందేమాతరం ఆలపిస్తున్న విద్యార్థినులు

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ సేవలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ సతీష్ మేకల

సిద్దిపేట కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ సేవలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన సీనియర్ మేనేజర్ సతీష్ మేకల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇండియన్ పోస్టాఫీసు అందించే సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పోస్టల్ డోర్‌స్టెప్ బ్యాంకింగ్ సేవలను అందిస్తుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులకు సిద్దిపేట పోస్టాఫీసు బ్రాంచ్ తరఫున ఇంటర్న్‌షిప్ కి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సిద్దిపేట పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం సంయుక్తంగా అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకున్నారు. ప్రిన్సిపాల్ డా. జి సునీత మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డా.గోపాల సుదర్శనం, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ మధుసూదన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేయాలి

సిద్దిపేట అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పాత పద్ధతిలో సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్న కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ హైమావతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పత్తి పంట దెబ్బతినడంతో రైతాంగానికి తీవ్ర నష్టంతో ఆందోళన చెందుతున్న క్రమంలో పత్తి పంటను సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కపాస్ యాప్ ద్వారా రైతులు స్మార్ట్ ఫోన్‌లో ఒక రోజు ముందు స్లాట్ బుక్ చేసుకోవాలని, గతంలో ఎకరానికి 12 క్వింటాళ్లు కొనుగోలు చేసిన సీసీఐ, ఈ సారి 7 క్వింటాళ్లకు కుదించడం రైతు కు తీవ్ర నష్టం చేకూరుతుందన్నారు. కపాస్ యాప్ ను ఎత్తివేసి నేరుగా పాత పద్ధతిలోనే పత్తిని కొనుగోలు చేయాలని కలెక్టర్‌ను వారు కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి స్పందిస్తూ రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, సీసీఐ కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తామని చెప్పినట్లు మంద పవన్ తెలిపారు.వినతిపత్రం సమర్పించినవారిలో జిల్లా కార్యవర్గసభ్యుడు జనార్దన్ ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ప్లాస్టిక్ బ్యాగులు వినియోగించవద్దు



హుస్నాబాద్ అంగడిలో ప్లాస్టిక్ సంచులు వాడొద్దని అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

హుస్నాబాద్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ అంగడిలో శుక్రవారం ప్లాస్టిక్ బ్యాగుల వల్ల జరిగే అనర్థాలపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ బ్యాగులు, వస్తువులు వినియోగించవద్దని వ్యాపారులకు, వినియోగదారులకు సూచించారు. వస్త్రాలు, జనపనారతో తయారు చేసిన సంచులను మాత్రమే వాడాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు వరదనీటి ప్రవాహలకు అడ్డుపడి పట్టణంలో వరదలకు కారణమయ్యాయన్నారు. ప్లాస్టిక్‌ను తరిమేసి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి బిక్షపతి తదితరులున్నారు.

ఫంక్షన్ హాల్ నిర్వాహకులతో సమావేశం

ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించాలని హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని ఫంక్షన్‌హాల్ యజమానులు, శుభాకార్యాలు నిర్వహించే నిర్వాహకులతో కమిషనర్ టి మల్లిఖార్జున్ సమావేశం నిర్వహించారు.

అన్ని శుభకార్యాలకు ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించి స్టీల్ బ్యాంకులను వినియోగించాలని సూచించారు. ఎవరైనా ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే రూ. 10 వేల జరిమానా విధిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ బాలఎల్లం, రవికుమార్ తదితరులున్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన అవసరం

సిద్దిపేట రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాల నిరోధానికి ప్రజల్లోతప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని చిన్నకోడూరు ఏఎస్ఐ సంపత్ కుమార్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం మాటిండ్ల ఆర్డీఎఫ్ పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సంపత్ కుమార్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీం ఏఎస్ఐ కిషన్, ప్రధానోపాధ్యాయులు మాసిరెడ్డి బాపెరెడ్డి, కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, మమత, రజిని తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ సంపత్

క్విజ్ పోటీల్లో కొండాపూర్ విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి వివిధ రకాల పోటీ పరీక్షలను ఎంఈవో ప్రవీణ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కొండాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. క్విజ్ పోటీల్లో వర్ష, లహరి, అయేషా, శ్రావణి మొదటి బహుమతిని, వ్యాసరచన పోటీల్లో శివాని మొదటి బహుమతిని, ఉపన్యాస పోటీల్లో అక్షిత రెండో బహుమతి, ఆబ్జెక్టివ్ పోటీల్లో లహరి రెండో బహుమతి, మూడవ బహుమతిని వర్ష సాధించి సత్తాచాటినట్లు ప్రధానోపాధ్యాయురాలు స్వప్నరెడ్డి తెలిపారు.

మర్కుక్‌లో విద్యార్థులకు పోటీలు

మర్కుక్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం, టీసాట్ ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం పలు పోటీలు నిర్వహించారు. మండల వనరుల కేంద్రం వేదికగా జడ్పీ ఉన్నత పాఠశాల మర్కుక్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం ఆధ్వర్యంలో మూడు రకాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో క్విజ్ విభాగంలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం పొందగా, ఉపన్యాసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కుక్, వ్యాసరచన పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంట ఎల్ వైష్ణవి 10వ తరగతి విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నబ్రహ్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్, హారిక, ఎంఐఎస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీవీ రామన్ జయంతి సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని హుస్నాబాద్ పట్టణంలోని సీవీ రామన్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు క్విజ్, టాలెంట్ పోటీలను నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాయిత నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పెద్దమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

సిద్దిపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి):అక్బర్‌పేట-భూంపల్లి మండలం బేగంపేట గ్రామంలో శుక్రవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవానికి కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డికి ఆలయ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు వెంకటస్వామిగౌడ్, చంద్రశేఖర్, ప్రతాప్, బాలాగౌడ్, వెంకటేశం, రవీందర్, సురేందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి , రమేష్, స్వామి ఉన్నారు.

మల్లన్న సన్నిధిలో బీసీ కమిషన్ చైర్మన్ ప్రత్యేక పూజలు



కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయాధికారులు

కొమురవెల్లి,నవంబర్7(ఆంధ్రజ్యోతి):ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, బీసీ కమిషన్ సభ్యులు టి.సురేందర్ దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి టంకశాల వెంకటేష్ స్వామివారి చిత్రపటాన్ని అందించగా, అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి శేష వస్త్రాలను,తీర్థ ప్రసాదాలను అందించారు. వెంట తహసీల్దార్ జి.దివ్య, ఏఈవో శ్రీనివాస్, ఎస్ఐ రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

చెరువుల్లోకి చేరనున్న చేపపిల్లలు

(3వ పేజీ తరువాయి)

నిర్వహించగా, కొంత ఆలస్యమైనప్పటికీ కాంట్రాక్టర్లు చేప పిల్లలను సరఫరా చేసేందుకు ముందుకు వచ్చారు.

పంపిణీ వివరాలు

35-40 మి.మీ. సైజు చేప పిల్లలు 1.79 కోట్లు కాగా.. 80-100 మి.మీ.సైజు 2.63 కోట్ల చేప పిల్లలను చెరువుల్లో వేయనున్నారు. చేపల పంపిణీ ప్రక్రియ ఆలస్యమైనప్పటికీ కాంట్రాక్టర్లు నాణ్యమైన చేప పిల్లలను అందించాలని, అధికారులు సైతం పర్యవేక్షణ చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..



జిల్లాలో చేప పిల్లల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశాం. రెండు రోజుల్లోనే చేప పిల్లల పంపిణీ కసరత్తు చేస్తున్నాం. 4.42 కోట్ల చేప పిల్లలు జిల్లాలో 1715 రిజర్వాయర్లు, చెరువుల్లో వేయనున్నాం.

- జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

● ఇద్దరికి 4 రోజులు.. ఒకరికి 3రోజుల జైలు

గజ్వేల్/మద్దూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గజ్వేల్, మద్దూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురిలో ఐదుగురికి కోర్టు జరిమానా విధించింది. అందులో ఇద్దరికి నాలుగు రోజులు, ఒకరికి మూడురోజుల జైలుశిక్షను విధిస్తూ ఆయా కోర్టుల న్యాయాధికారులు తీర్పు చెప్పారు. గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళి తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినవారిని శుక్రవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు మొత్తం రూ.32వేల జరిమానా విధించారు. నిందితుల్లో ఇద్దరికి జరిమానాతో పాటు 4రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అదేవిధంగా మద్దూరు ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తీగల సిద్ధులును శుక్రవారం చేర్యాల కోర్టులో హాజరుపరచగా మూడురోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పును వెల్లడించారు.

తొలగించిన అనభేరి విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలి



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్‌డిపో క్రాస్ రోడ్డులో ఉన్న తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్ రావు విగ్రహాన్ని జాతీయ రహదారి నిర్మాణంలో తొలగించారని, దీనిని మళ్లీ అదే స్థానంలో పునః ప్రతిష్ఠించాలని సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ టి మల్లిఖార్జున్‌కు వినతిపత్రం సమర్పించారు. 2012 సంవత్సరంలో సీపీఐ ఆధ్వర్యంలో అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని అప్పటి ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేశామని వెల్లడించారు. సంవత్సరం క్రితం జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతుండగా అక్కడి నుంచి తీసి స్థానిక సీపీఐ ఆఫీసులో భద్రపరిచారన్నారు. ప్రస్తుతం అదే స్థలంలో అనభేరి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, నాయకులు సంజీవరెడ్డి, కుమారస్వామి, బత్తుల బాబు, మల్లారెడ్డి తదితరులున్నారు.

కేన్సర్ కేసులు పెరుగుతున్నాయి



ఓరల్ స్ర్కీనింగ్ ఫ్రీక్యాంప్‌లో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

సిద్దిపేట కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కేన్సర్ డే సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని రామడెంటల్ హస్పిటల్‌లో ఓరల్ కేన్సర్ స్ర్కీనింగ్, కేన్సర్ అవేర్‌నెస్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉచితంగా ఓరల్ కేన్సర్ స్ర్కీనింగ్ చేశారు. అనంతరం వారికి వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా డెంటల్ ఆస్పత్రి వైద్యుడు డా. డి. బాలసునీల్‌కుమార్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కేన్సర్ కేసులు పెరుగుతున్నాయన్నారు. అయితే శరీరంలో కేన్సర్ ఎక్కడ మొదలైన కూడా దాని మేనిఫెస్టేషన్స్ నోటి నుంచి ప్రారంభమవుతాయన్నారు. అందువల్ల ఓరల్ కేన్సర్ స్ర్కీనింగ్ ద్వారా వ్యాధి తీవ్రతను తెలుసుకోవచ్చన్నారు. అంతేకాకుండా శరీరంలో జరిగే మార్పులను గమనించే అవకాశం ఉంటుంది. ఓరల్ కేన్సర్ స్ర్కీనింగ్ ద్వారా 5 సంవత్సరాల ముందుగానే వ్యాధి వచ్చే అవకాశాన్ని తెలుసుకునే అవకాశముందన్నారు. ముందుగానే గమనిస్తే వ్యాధి రాకుండా జాగ్రత్త పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో సామాజిక బాధ్యతగా రామ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత ఓరల్ స్ర్కీనింగ్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

ఈ-కేవైసీ పూర్తి చేయాలి



వంగపల్లిలో ఈ-కేవైసీ తీరును పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ డీఆర్డీవో

మద్దూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ కూలీలకు ఈ- కేవైసీ పూర్తి చేయించాలని జిల్లా అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్‌గౌడ్ టీఏలకు సూచించారు. శుక్రవారం మండలంలోని వంగపల్లి గ్రామాన్ని సందర్శించి ఈ-కేవైసీ చేస్తున్న తీరును పరిశీలించి మాట్లాడారు. మండలంలో మొత్తం 5854 ఈ-కేవైసీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 5,489 పూర్తి చేసినట్లు తెలిపారు. 365 మందికి సంబంధించి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ-కేవైసీ వెంటనే పూర్తి చేయించాలని టీఏలకు సూచించారు. పూర్తి కాని కూలీలకు ఉపాధిహామీ పనులు చేయడానికి వీలు లేదన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ ఉపాధిహామీ పనుల ఎంపిక త్వరగా పూర్తి చేయాలని ఏపీవో మంజులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంమోహన్, సెక్రటరీలు మాధవ్ జాదవ్ కిరణ్, శ్రీనివాస్, టీఏ దేవేందర్, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య ఉన్నారు.

బాధ్యత గల పౌరుడిగా రోడ్లను బాగుచేయించాం



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డు గుంతలను పూడ్చిన అనంతరం ట్రాఫిక్ సీఐ మురళితో బీజేపీ నాయకులు

గజ్వేల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బాధ్యత గల పౌరుడిగా రోడ్లను బాగుచేయించామని బీజేపీ సీనియర్ నేత, టెలికాం బోర్డు సభ్యుడు కమ్మరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'అధ్వాన దారులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి బీజేపీ సీనియర్ నాయకుడు, టెలికాం బోర్డు సభ్యుడు కమ్మరి శ్రీనివాస్, బీజేపీ నాయకులు స్పందించి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్డు, పోలీస్‌స్టేషన్ ఎదుట గల రోడ్డుపై గుంతలను సొంత డబ్బులతో బాగు చేయించారు. ఈ సందర్భంగా కమ్మరి శ్రీనివాస్ మాట్లాడుతూ... సమస్యను ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని, దీంతో తానే స్వయంగా మరమ్మతు చేయించానని పేర్కొన్నారు. ట్రాఫిక్ సీఐ మురళి బీజేపీ నాయకులను అభినందించారు.

ప్రమాదాలు జరుగుతున్నా.. రోడ్డు మరమ్మతులు జరిపించరా?

చేర్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చేర్యాల - నాగపురి ప్రధాన రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారినా మరమ్మతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ పేర్కొన్నారు. కొన్నాళ్లక్రితం దెబ్బతిన్న చేర్యాల-నాగపురి రోడ్డును శుక్రవారం సీపీఐ నాయకుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో పాటు సైడుబర్మ్‌లు కోతకు గురై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు.నాయకులు ఈరు భూమయ్య, వలబోజు నర్సింహ్మాచారి, నంగి కరుణాకర్, నర్సిరెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.